సాక్షి విశాఖపట్నం

శుక్రవారం। 25। అక్టోబర్। 2024

వైఎస్ జగన్‌ను కలిసిన జిల్లా నేతలు



విశాఖ విమానాశ్రయంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి, అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి, పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, డిప్యూటీ మేయర్ కె.సతీష్, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు కొండా రాజీవ్‌గాంధీ, అల్లూకృష్ణ, ముఖ్యనేతలు శరగడం చినఅప్పలనాయుడు, దేవన్‌రెడ్డి, గండి రవి, మొల్లి అప్పారావు, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, జి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. –సాక్షి, విశాఖపట్నం

న్యూస్‌రీల్

ఏపీఈపీడీసీఎల్‌కు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) మరో జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. ఈ నెల 22 నుంచి 23వ తేదీ వరకు ఢిల్లీలో ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 18వ జాతీయ ఇంధన సదస్సు జరిగింది. ఇంధన రంగంలో వివిధ అంశాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సంస్థలకు 12వ ఇన్నోవేషన్ ఇంపాక్ట్ అవార్డ్స్ ఫర్ డిస్కమ్స్ పేరిట అవార్డులు ప్రదానం చేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్న ఏపీఈపీడీసీఎల్‌కు 'కేటగిరీ ఎఫ్–ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్–లార్జ్ డిస్కమ్స్'లో అవార్డు లభించింది. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అనిల్ రాజ్‌దన్ చేతుల మీదుగా ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది ఉత్తమ పనితీరుకు నిదర్శనంగా సంస్థ జాతీయ అవార్డును సొంతం చేసుకుందన్నారు.

డీఈవోగా ప్రేమ్‌కుమార్

మాణిక్యంనాయుడుకు విజయనగరం డీఈవోగా పోస్టింగ్

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖాధికారిగా ఎస్.ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ డీఈవోగా పనిచేస్తున్న చంద్రకళ పల్నాడు డీఎస్ఈవోగా బదిలీ అయ్యారు. విజయనగరం డీఈవోగా పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్‌ను విశాఖపట్నం డీఈవోగా బదిలీ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా, విశాఖ, యలమంచిలి డిప్యూటీ డీఈవోగా పనిచేసిన అనుభవం దృష్ట్యా ప్రేమ్ కుమార్ జిల్లా విద్యాశాఖ పాలనలో తనదైన ముద్ర వేస్తారని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. కాగా భీమునిపట్నం డైట్ కాలేజీలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న యు.మాణిక్యం నాయుడును విజయనగరం డీఈవోగా పోస్టింగ్ ఇచ్చారు.

ముగ్గురు సీఐలకు స్థానచలనం



విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి విశాఖకు వచ్చిన జి.దేముడుబాబును వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే అక్కడ విధులు నిర్వర్తిస్తున్న బి.భాస్కరరావును మహారాణిపేట లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు. మహారాణిపేట సీఐ పి.శ్రీనివాసరావును డిప్యూటేషన్‌పై ఇంటెలిజెన్స్‌కు వెళ్లేందుకు విశాఖ రేంజ్‌కు సరెండర్ చేశారు.

తిరుమల దూరాభారం

తిరుమల ఎక్స్‌ప్రెస్ రూట్ మార్చేందుకు దక్షిణ మధ్య రైల్వే యత్నం



- రైల్వే బోర్డుకి ప్రతిపాదనలు పంపిన అధికారులు
- ఒంగోలు రూట్‌లో కాకుండా గుంటూరు, నంద్యాల మీదుగా వెళ్లేలా మార్పులు
- ఇదే జరిగితే 5 గంటలు ఆలస్యంగా తిరుపతి చేరుకోనున్న స్థానిక భక్తులు
- వాల్తేరు డివిజన్ అభిప్రాయం తీసుకోకుండానే కుట్రకు తెర!

తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలంటే కోస్తాంధ్ర జిల్లాల భక్తులందరికీ గుర్తొచ్చే ఒకే ఒక్క రైలు తిరుమల ఎక్స్‌ప్రెస్. ఈ రైలు ఎక్కితే.. స్వామి దర్శనానికి సరైన సమయంలో చేరుకోవచ్చు. అందుకే ఈ రైలుకు అంత డిమాండ్. కానీ.. ఇప్పుడా పరిస్థితులు కనిపించవేమో.? ఎందుకంటే తిరుమల ఎక్స్‌ప్రెస్ రూట్ మార్చేందుకు దక్షిణ మధ్య రైల్వే యత్నిస్తోంది. కొత్త రూట్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి రైల్వే బోర్డుకు పంపింది. వాల్తేరు డివిజన్ అభిప్రాయం తీసుకోకుండానే కుట్రకు తెర తీసినట్లు తెలుస్తోంది.

– సాక్షి, విశాఖపట్నం

తిరుమల ఎక్స్‌ప్రెస్ ఒక రైలు కాదు.. ఆధ్యాత్మిక కేంద్రం. శ్రీకాకుళం నుంచి ఒంగోలు వరకు తిరుపతి వెళ్లే ప్రయాణికులు కచ్చితంగా ఎంపిక చేసుకునే మొదటి ఆప్షన్ ఈ రైలే. వేంకటేశ్వర స్వామిని దర్శించుకునే వేళలకు అనువుగా తిరుపతి చేర్చే రైలు దాదాపు ఇదే ఉంది. అందుకే తిరుమల ఎక్స్‌ప్రెస్ భక్తులకు సెంటిమెంట్‌గా మారిపోయింది. ఈ ఎక్స్‌ప్రెస్‌కి వెళ్తేనే తిరుపతి వెళ్లి.. ఏడుకొండల వాడి దర్శనం సజావుగా సాగుతుందనే నమ్మకం చాలా మందిలో ఉంది. అందుకే ఈ రైలు ప్రతి రోజూ 100 శాతానికి పైగా ఆక్యుపెన్సీతో పరుగులు పెడుతుంటుంది. వెయిటింగ్ లిస్ట్ చాంతాడంత పెరిగిపోయినా.. రిజర్వేషన్ కన్‌ఫర్మ్ అవుతుందనే ఏదో ఒక నమ్మకంతో ఈ రైలుకే రిజర్వేషన్ చేస్తుంటారు. ఒక వేళ సీటు దొరక్కపోయినా నిలబడైనా వెళ్లేందుకు సిద్ధమైపోతుంటారు.

దర్శన వేళలకు అనువైన రైలు

తిరుమల దర్శనానికి అన్ని ప్రాంతాల వారికీ అనువైన రైలు ఇదే. 17488 నంబర్‌తో నడిచే ఈ సర్వీస్ విశాఖలో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరుతుంది. తిరుపతి రైల్వేస్టేషన్‌కు తర్వాత రోజు వేకువజామున 4.30కి చేరుకుంటుంది. అక్కడ దిగే భక్తులు అలిపిరి మార్గంలోనైనా, శ్రీవారి మెట్ల మార్గంలోనైనా వెళ్లేందుకు సరైన సమయం ఇది.



అంటే తిరుపతిలో దిగి స్నానమాచరించి శ్రీవారి మెట్ల మార్గానికి ఉదయం 6 గంటలకు చేరుకుంటే ఉదయం 10 లేదా 11 గంటల దర్శనానికి టోకెన్ లభిస్తుంది. ఆ టోకెన్‌తో స్వామివారి దర్శనం చేసుకున్న తర్వాత తిరుగు ప్రయాణం కూడా సులువవుతుంది. అందుకే తిరుమల ఎక్స్‌ప్రెస్‌నే అందరూ నమ్ముకుంటారు.

అదనంగా నాలుగైదు గంటలు వృథా

వాస్తవానికి ఈ రైలు ఈస్ట్‌కోస్ట్ జోన్ పరిధిలో ఉన్నప్పటికీ.. నడిచే రూట్ మొత్తం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే ఉంది. విశాఖలో బయలుదేరి దువ్వాడ వరకు మాత్రమే ఈస్ట్‌కోస్ట్ పరిధిలోకి వస్తుంది. మిగిలినదంతా దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఉంది. అంతే కాకుండా ట్రైన్ టెర్మినేటింగ్ కూడా ఆ జోనే చూస్తోంది. అందుకే తిరుమల ఎక్స్‌ప్రెస్ రూట్ మార్చే ప్రతిపాదనలు చేసేందుకు ఆ జోన్‌కు అన్ని అర్హతలున్నాయి. దీన్ని ఆసరాగా తీసుకుని కొన్ని రూట్లకు రైలు అవసరమని.. అందుకే తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఆ వైపుగా దారి మళ్లించేందుకు అంగీకరించాలంటూ రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపించింది. విజయవాడ నుంచి ఒంగోలు మీదుగా కాకుండా.. విజయవాడ నుంచి గుంటూరు, నంద్యాల, ఎర్రగుంట్ల, కడప, రేణిగుంట మీదుగా తిరుపతి వెళ్లేలా రూట్ మార్పులకు అనుమతి కోరింది. దీనికి బోర్డు ఓకే చెబితే.. మన ప్రయాణం మరింత భారంగా మారుతుంది. ప్రస్తుతం విశాఖపట్నంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ రైలు ఎక్కితే 14.30 గంటల పాటు తిరుపతికి ప్రయాణం సాగుతుంది. కొత్త రూట్ అయితే మరో 5 గంటలు అదనపు సమయం పడుతుంది. అంటే విశాఖపట్నంలో మధ్యాహ్నం రెండు గంటలకు రైలు ఎక్కితే.. తర్వాత రోజు ఉదయం 9 లేదా 10 గంటలకు తిరుపతి చేరుకుంటారు. దీని వల్ల దర్శన వేళలకు అందే అవకాశం ఉండదు. ఈ రూట్ మార్చితే ఉత్తరాంధ్రతో పాటు విజయవాడ వరకూ ఉన్న భక్తులు తిరుమల వెళ్లేందుకు అవస్థలు తప్పవు. దక్షిణ మధ్య రైల్వే దుర్బుద్ధిపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూటు మారితే చేటే!

1970లో ప్రారంభమైన తిరుమల ఎక్స్‌ప్రెస్ సర్వీస్ కొన్నేళ్ల కిందట కడప వరకూ పొడిగించారు. అయినప్పటికీ కోస్తాంధ్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. కారణం తిరుపతి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తర్వాత కడప వెళ్లేది. ఇప్పుడు మరోసారి రూట్ మార్చేందుకు దక్షిణ మధ్య రైల్వే కుయుక్తులు పన్నుతోంది. ప్రస్తుతం ఈ రైలు విజయవాడ నుంచి ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట జంక్షన్ మీదుగా తిరుపతి చేరుకుని అక్కడి నుంచి కోడూరు, రాజంపేట మీదుగా కడప వెళ్తుంది. అయితే ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలోని తిరుమల ఎక్స్‌ప్రెస్ సర్వీసు రూటు మార్చాలని దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు భావిస్తున్నారు. కారణాలు ఏమీ చెప్పకుండానే రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రతిపాదనలు ఒప్పుకుంటే ఇకపై విజయవాడ నుంచి ఒంగోలు వైపుగా వెళ్లకుండా.. గుంటూరు మీదుగా నడుస్తుంది. ఇదే జరిగితే భక్తులు తిరుపతి వెళ్లే సమయం పూర్తిగా మారిపోతుంది. వేళకు స్వామి దర్శనానికి అందే పరిస్థితి ఉండదు.

ఇదేం రూట్ మార్పు?



తిరుమల ఎక్స్‌ప్రెస్ అంటే మాకో నమ్మకం. ఎప్పుడు తిరుపతి వెళ్లాలన్నా.. ఈ రైలునే ఎంచుకుంటాం. ఎందుకంటే వేకువ జామునే తిరుపతి చేరుకుంటుంది. అక్కడ నుంచి ఎండ పెరిగే లోపు మెట్లమార్గంలోనైనా.. కాలినడకనైనా.. ఏ దర్శనానికైనా నిర్ణీత సమయానికి తిరుమలకు చేరుకుంటాం. దర్శనానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాయిగా ప్రయాణం సాగిపోతుంది. అలాంటి రైలు రూట్‌ను మార్చడం సరి కాదు. రైల్వే అధికారులు దీనిపై పునరాలోచించాలి.

– ఎం.ఉషారాణి, సీతమ్మధార

ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలి



తిరుపతి వెళ్లే ప్రతి భక్తుడూ దశాబ్దాలుగా తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను నమ్ముకుంటున్నారు. అలాంటి ఈ రైలును వేరే మార్గంలో తిప్పాలని ఎలా ప్రతిపాదిస్తారు? జోన్ అధికారులకు భక్తుల మనోభావాలతో సంబంధం లేదా? కొత్త రూట్‌లో తిప్పితే కోస్తాంధ్ర జిల్లాల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు రైల్వే బోర్డుపై ఒత్తిడి తేవాలి. సౌత్ సెంట్రల్ జోన్ పంపిన ప్రతిపాదనలు తిప్పికొట్టేలా పోరాడాలి.

– కె.రామసుధ, ప్రయాణికురాలు

జైలు డీఎస్‌గా జవహర్ బాబు




ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్(డీఎస్)గా కె.జవహర్ బాబు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఎస్–1గా పనిచేసిన రామచంద్రరావు గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానాన్ని ఇంకా భర్తీ చేయలేదు. డీఎస్–2గా పనిచేస్తున్న కమలాకరరావును ఇటీవల కడప కేంద్ర కారాగారానికి అటాచ్‌మెంట్‌లో భాగంగా పంపించారు. ఆయన స్థానంలో కడప నుంచి వచ్చిన జవహర్‌బాబు ఇటీవల బాధ్యతలు స్వీకరించారని సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ తెలిపారు.

జిల్లా అభివృద్ధిపై సమీక్ష నేడు

మహారాణిపేట: జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, పరిపాలనాపరమైన అంశాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చర్చించనున్నారు. అన్ని విభాగాల హెచ్‌వోడీలు పూర్తిస్థాయి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచించారు.

31న అప్పన్న దర్శన వేళల్లో మార్పులు



సింహాచలం: దీపావళి పురస్కరించుకుని ఈ నెల 31న సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దర్శనాలు లభిస్తాయని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. నవంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు ఆలయంలో మనవాళ్ల మహామునులు తిరునక్షత్రం పూజలు నిర్వహించనున్నారు. ఆ రోజుల్లో స్వర్ణ పుష్పార్చన, స్వర్ణ తులసీ దళార్చన, గరుడసేవ, నిత్య కల్యాణం సేవలను రద్దు చేశారు.

డీఆర్వో మోహన్‌కుమార్ బదిలీ



మోహన్‌కుమార్

మహారాణిపేట: జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్‌కు బదిలీ అయింది. ఆయన్ని చిత్తూరు డీఆర్వోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో బి.హెచ్.భవానీ శంకర్‌ను నియమించింది.

తుపాను సహాయక చర్యలకు నావికాదళం సిద్ధం

సాక్షి, విశాఖపట్నం: ఒడిశా, పశ్చిమ బెంగాల్‌పై విరుచుకుపడేందుకు దూసుకొస్తున్న తీవ్ర తుపాను 'దానా' ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు అందించేందుకు తూర్పు నావికాదళం సిద్ధమైంది. తుపాను సహాయక సిబ్బంది ప్రభావిత ప్రాంతాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. అందుబాటులో ఉన్న సహాయక, డైవింగ్ బృందాల్ని ఇప్పటికే ఒడిశాకు నేవీ అధికారులు పంపించారు. అదేవిధంగా రోడ్డు, వాయు మార్గాల ద్వారా సామగ్రి తరలింపునకు చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో సముద్రం నుంచి కూడా సహాయక చర్యలు అందించేందుకు రెండు యుద్ధ నౌకలు విశాఖ నుంచి బయలుదేరనున్నాయని తూర్పు నౌకాదళాధికారులు వెల్లడించారు. కమాండ్ బేస్ విక్చువల్లింగ్ యార్డ్(బీవీవై) మెటీరియల్ ఆర్గనైజేషన్, నేవల్ హాస్పిటల్ ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణి మొదలైన యూనిట్లకు చెందిన సిబ్బంది ఒడిశా, బెంగాల్ రాష్ట్రాలకు పయనమయ్యారు.



ఐఎన్ఎస్ డేగా నుంచి సహాయక సామగ్రి సిద్ధం చేస్తున్న నేవీ సిబ్బంది

విశాఖ–కిరండూల్ రైలుకు నేడు విస్టాడోమ్ కోచ్ జత

తాటిచెట్లపాలెం: అరకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు శుక్రవారం ఒక్క రోజు అదనంగా విస్టాడోమ్ కోచ్‌ను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 26న కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ అదనపు విస్టాడోమ్ కోచ్‌తో ప్రయాణిస్తుంది.

బ్లాస్ట్‌ఫర్నేస్–1లో ఉత్పత్తికి చర్యలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్–1(గోదావరి) ఉత్పత్తికి సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి పనులు యుద్ధప్రాతిపాదికన జరుగుతున్నాయి. గతంలో బీఎఫ్–1, బీఎఫ్–2లు ఉత్పత్తి ప్రక్రియలో కొనసాగేవి. స్టీల్‌ప్లాంట్‌కు ఏర్పడ్డ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఐరన్ ఓర్, బొగ్గు కొరత ఏర్పడ్డాయి. దాంతో ఆరు నెలల క్రితం బీఎఫ్–1ను తాత్కాలికంగా నిలిపివేశారు. అప్పటి నుంచి బ్లాస్ట్‌ఫర్నేస్–2లో మాత్రమే ఉత్పత్తి కొనసాగుతోంది. నెల రోజులుగా కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సమీక్షల ఫలితంగా ప్లాంట్‌కు రూ.1,650 కోట్ల ప్యాకేజీ లభించింది. దాంతో ముడి సరకులు కొనుగోలు చేశారు. ఉక్కు యాజమాన్యం ఈ నెల 27న ఈ ఫర్నేస్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. ఎటువంటి ఆటంకం ఏర్పడకపోతే నిర్ణీత వ్యవధిలో ఫర్నేస్ ప్రారంభించే అవకాశం ఉంది. రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు నడిచి ఉత్పత్తి కొనసాగిస్తే ఉద్యోగులకు కొంత ఉపశమనం కలుగుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

ఇద్దరు ఎస్ఐల సస్పెన్షన్

- మరో ఇద్దరు హోం గార్డులు కూడా..
- బీచ్ రోడ్డు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పేరుతో వాహనదారులకు బెదిరింపులు
- ఒక ఆటో డ్రైవర్ సహాయంతో అక్రమ వసూళ్లు
- కమిషనర్ దృష్టికి వీరి వ్యవహారం
- విచారణ జరిపి చర్యలు తీసుకున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: పోలీస్ శాఖలో లంచావతారులపై నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కొరడా ఝుళిపించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో వాహనదారులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు హోంగార్డులపై సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో ఒక్కసారిగా పోలీస్ శాఖలో కలకలం రేగింది. ఈ నెల 17వ తేదీన బీచ్ రోడ్డులో ఒక ప్రముఖ హోటల్ వద్ద మహారాణిపేట ట్రాఫిక్ ఎస్ఐ ఎం.ప్రసాద్, రెండో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ షేక్ నజరుద్దీన్, హోం గార్డులు ఆర్.వెంకటత్రినాథ్, సి.హెచ్.శివగణేష్‌లు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని కొంత మంది వాహనదారులతో బెదిరింపులకు దిగారు. అలాగే ఒక ఆటో డ్రైవర్ సహకారంతో అక్రమ వసూళ్లకు తెర లేపారు. ఈ విషయం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి దృష్టికి వెళ్లింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న సీపీ రహస్యంగా విచారణ జరిపించారు. ఇందులో ఇద్దరు ఎస్ఐలు, హోంగార్డులు అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు నిర్ధారణ అవడంతో వారిని తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేశారు. నగర పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సీపీ ఆదేశించారు. విధులలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడినా తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ శాఖలో ఎవరైనా లంచం అడిగినా, తీసుకున్నా వెంటనే తన నంబర్ 7995095799కు తెలియజేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.

ప్రజా సమస్యలపై పట్టింపేది?

- జెడ్పీ సమావేశాలకు కూటమి ప్రజాప్రతినిధుల డుమ్మా
- మరికొందరు చుట్టపు చూపుగా వచ్చి ఫొటోలకు ఫోజులు

సాక్షి, విశాఖపట్నం: గతంలో జెడ్పీటీసీ సభ్యులు..ఎంపీపీలు..ఎమ్మెల్యేలు..ఎమ్మెల్సీలు..ఇలా ఎవరికైనా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అంటే ఎంతో గౌరవం ఉండేది. సమయపాలన పాటించి మరీ ప్రజా సమస్యలపై చర్చించేవారు. కీలకమైన అంశాలపై తీర్మానాలు జరిగేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు జెడ్పీ సర్వసభ్య సమావేశం అంటేనే పట్టింపు లేకుండాపోయింది. కీలకమైన ప్రజా ప్రతినిధులు డుమ్మా కొడుతున్నారు. మరికొందరు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు.

విశాఖలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఉమ్మడి విశాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి సమావేశానికి మంత్రులు హాజరుకాలేదు. ఇది రెండో సర్వసభ్య సమావేశం కాగా.. అధికార ప్రజా ప్రతినిధులు డుమ్మా కొట్టారు. తొలుత పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు వచ్చి గంట పాటు ఉండి వెళ్లిపోయారు. హోం మంత్రి వంగలపూడి అనిత అర్ధగంట పాటు మాత్రమే ఉన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విశాఖ ఎంపీ శ్రీ భరత్ వచ్చి కొంతసేపు ఉండి వెళ్లిపోయారు. ఇక మిగతా ఎమ్మెల్యేలెవ్వరూ రాలేదు. వచ్చిన కొందరు ప్రజాప్రతినిధులు కేవలం ఫొటోలకు ఫోజులిస్తూ కాలక్షేపం చేశారు.



మాట్లాడుతున్న హోంమంత్రి అనిత. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

గృహ నిర్మాణాలకు ఇసుక ఉచితమే..

ఇకపై గృహ నిర్మాణాలకు, ఇతర కట్టడాలకు ఇసుక ఉచితంగానే లభిస్తుందని.. స్థానిక అధికారులకు ముందస్తు సమాచారమిచ్చి ఇసుక తెచ్చుకోవచ్చని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు రూ.20 కోట్లతో రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కాలువలకు ఆనుకుని తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు చేయవద్దన్నారు. రోడ్లకు ఇరువైపులా తుప్పలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలో గంజాయికి ప్రత్యామ్నాయంగా పంటలను ప్రోత్సహించాలని సూచించారు.

పార్లమెంట్‌లో స్టీల్‌ప్లాంట్ అంశాన్ని ప్రస్తావించాలి

ముందుగా సీఈవో పి.నారాయణమూర్తి అజెండా అంశాలను చదివి వినిపించారు. సభ్యులు పలు అంశాలపై ప్రశ్నలు లేవనెత్తి సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని బాగా అమలు చేయాలని, ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని, పిల్లల భద్రతకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తూ సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలో భారీగా పంట నష్టం జరిగిందని, పారదర్శకంగా అంచనాలు వేసి పరిహారం అందించాలన్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఉపాధి హామీ, కల్వర్టుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, జల్‌జీవన్ మిషన్ పనులు తదితర అంశాలపై సభ్యులు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ విషయాన్ని స్థానిక ఎంపీ పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఓ సభ్యుడు విన్నవించగా.. విశాఖ ఎంపీ శ్రీ భరత్ స్పందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రం నుంచి సానుకూల పరిణామాలు చోటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే స్థానికంగా స్పందిస్తామని ఎంపీ అన్నారు. మార్కెటింగ్ కమిటీల ద్వారా వచ్చే ఆదాయాన్ని స్థానిక ప్రజా అవసరాల మేరకు వెచ్చించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు.



సమావేశానికి డుమ్మా కొట్టిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు

చర్చించిన అంశాలివీ..

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు జారిపడిన ఘటనలో జీకే వీధి మండల చట్రాపల్లి గ్రామస్తులకు సత్వర న్యాయం జరగలేదని అరకు ఎంపీ తనూజారాణి అన్నారు. గిరిజన ప్రజల ప్రాణాలంటే ఎందుకు లెక్క లేదని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామస్తులకు పీఎం ఆవాస్ యోజన పథకం కింద మోడల్ కాలనీని నిర్మిస్తామని తెలిపారు. కాఫీ, మిరియాలు, జీడితోటలు, ఇతర పండ్ల తోటలకు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసే విధంగా పార్లమెంట్‌లో ప్రస్తావించాలని జెడ్పీ చైర్‌పర్సన్, సభ్యులు ఎంపీని కోరగా.. తప్పకుండా ప్రస్తావిస్తామని ఆమె హామీ ఇచ్చారు. అనకాపల్లి మండలం సంపత్‌పురంలో నిర్మించిన ప్రాజెక్ట్ నుంచి 10 గ్రామాలకు తాగునీరు అందడం లేదని ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి మండల పరిధిలో క్వారీ వాహనాల వల్ల కాలుష్యం పెరిగిందని కో–ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివ సత్యనారాయణ, రాంబిల్లిలో 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఆ మండల జెడ్పీటీసీ, రోడ్డుకు ఇరువైపులా తుప్పలు తొలగించాలని బుచ్చియ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో నిబంధనల ప్రకారం ఎందుకు ఈవోపీఆర్‌డీలను బదిలీ చేయలేదని అనకాపల్లి, అల్లూరి డీపీవోలను జెడ్పీ చైర్‌పర్సన్ వివరణ కోరారు. దీనిపై అనకాపల్లి డీపీవో శిరీషరాణి మాట్లాడుతూ నక్కపల్లి, పరవాడలో నిబంధనల ప్రకారమే నియమించామని, దేవరాపల్లిలో ఇంకా నియమించలేదన్నారు.

26న బెంగళూరు-సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా స్పెషల్ రైళ్లు(వయా దువ్వాడ మీదుగా) నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ప్రయాణికులు ఈ రైళ్లను వినియోగించుకోవాలని సూచించారు. ఎస్ఎంవీ బెంగళూరు-సంత్రగచ్చి(06211) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26వ తేదీ శనివారం ఉదయం 10.15 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 3.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.55 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 7.45 గంటలకు సంత్రగచ్చి వెళ్తుంది. సంత్రగచ్చి-ఎస్ఎంవీ బెంగళూరు(06212) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27వ తేదీ ఆదివారం రాత్రి 11.30 గంటలకు సంత్రగచ్చిలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు వెళ్తుంది.

– సనత్‌నగర్-సంత్రగచ్చి(07069) స్పెషల్ ఈ నెల 30, నవంబరు 6వ తేదీల్లో (బుధవారం) ఉదయం 6.20 గంటలకు సనత్‌నగర్‌లో బయలుదేరి.. అదే రోజు రాత్రి 8.55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.57 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రగచ్చి వెళ్తుంది. సంత్రగచ్చి-సనత్‌నగర్(07070) స్పెషల్ ఈ నెల 31, నవంబరు 7వ తేదీల్లో సాయంత్రం 5.25 గంటలకు సంత్రగచ్చిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.27 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.50 గంటలకు సనత్‌నగర్ వెళ్తుంది.

తుపాను కారణంగా రద్దయిన రైళ్లు

దానా తుపాను కారణంగా 25వ తేదీన పురూలియా-తిరునల్వేలి (22606) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరా-సికింద్రాబాద్(12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

మహిళా కబడ్డీ జట్టు విజేత చీపురుపల్లి 'ఎస్‌వీఎస్'

విశాఖ స్పోర్ట్స్ : ఏయూ అంతర కళాశాలల మహిళా కబడ్డీ సెలక్షన్ ట్రయిల్స్ మ్యాచ్‌ల్లో చీపురుపల్లి ఎస్‌వీఎస్ డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో చీపురుపల్లికే చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టుపై 36 పాయింట్ల తేడాతో (42-8) విజయం సాధించింది. ఏయూ జిమ్నాజియంలో గురువారంతో ముగిసిన ఈ పోటీల్లో మూడో స్థానానికి జరిగిన పోటీల్లో వీజీడీ కళాశాల జట్టు 12-8 పాయింట్లతో తేడాతో సత్యా డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. పోటీల ముగింపు కార్యక్రమానికి ఏయూ డీన్ ఆచార్య ధనరాజ్ హాజరై ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఏయూపీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తుఫాను తిప్పలు

రైళ్ల రద్దుతో ప్రయాణికుల తీవ్ర అవస్థలు



నెట్టుకుంటూ వెళ్లేనే చోటు



హమ్మయ్య చోటు దొరికింది.. ఎలాగోలా వెళ్లపోదాం.!



రైల్వేస్టేషన్‌లో పడిగాపులు



అలెప్పీ–ధన్‌బాద్ రైలులో వాష్‌రూమ్‌లో ప్రయాణికులు





మా రైలు ఎప్పుడొస్తుందో...



పిల్లాపాపలతో ఇక్కట్లు

దానా తుపాను ప్రభావంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు వెళ్లే 86 రైళ్లు రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో వేలాది మంది ప్రయాణికులు ఇరుక్కుపోయి నానా తిప్పలు పడుతున్నారు. స్టేషన్ ప్లాట్‌ఫారాలు, వెయిటింగ్ హాల్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, టికెట్ కౌంటర్ ప్రాంగణాలన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. కొన్ని రైళ్లు మాత్రమే నడుస్తుండడంతో వాటి కోసం ప్రయాణికులు ఎగబడుతున్నారు. జనరల్, రిజర్వేషన్ అన్న తేడా లేకుండా అన్ని బోగీలు ప్రయాణికులతో నిండిపోతున్నాయి. చివరికి వాష్‌రూమ్‌లు కూడా ఖాళీగా లేవు. ఎలాగైనా ఇంటికి చేరుకోవాలనే తాపత్రయంతో ప్రజలు ఈ పరిస్థితుల్లోనూ ప్రయాణిస్తున్నారు.

ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రేపటి నుంచి రంజీ మ్యాచ్

- హిమాచల్ ప్రదేశ్‌తో తలపడనున్న ఆంధ్ర
- సిద్ధమైన వైఎస్సార్ స్టేడియం

విశాఖ స్పోర్ట్స్: దేశవాళీ క్రికెట్ రంజీ ట్రోఫీలో భాగంగా ఆంధ్రా జట్టు ఆడే మూడే మ్యాచ్‌కు వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. షేక్ రషీద్ నాయకత్వంలో ఆంధ్రా జట్టు హిమాచల్ ప్రదేశ్ జట్టుతో తలపడనుంది. శనివారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ప్రస్తుత సీజన్‌లో ఎలైట్ బీ గ్రూప్‌లో ఆడుతున్న ఆంధ్ర తొలి మ్యాచ్‌లో 74 పరుగుల తేడాతో విదర్భ చేతిలో ఓడిపోగా... రెండో మ్యాచ్‌లో ఒక వికెట్ తేడాతో గుజరాత్ చేతిలో పరాజయం పాలైంది. దీంతో ఎనిమిది జట్లు తలపడుతున్న బీ గ్రూప్‌లో ఆంధ్రతో సహా హైదరాబాద్ సైతం చివరి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో మ్యాచ్‌లో విజయం సాధించకుంటే ఎలైట్ సీ గ్రూప్‌నకు పడిపోయే అవకాశాలు లేకపోలేదు. హైదరాబాద్ జట్టు పుదుచ్చేరితో తలపడనుండగా... ఇప్పటికే ఒక విజయం సాధించిన హిమాచల్‌ప్రదేశ్ ఆంధ్రతో తలపడనుంది. ఆంధ్రా జట్టు గురువారం నెట్స్‌లో చెమటోడ్చింది.

ఆంధ్రా జట్టు కెప్టెన్‌గా రషీద్

ఆంధ్రా జట్టు కెప్టెన్ రికీబుయ్, బ్యాటింగ్ ఆల్‌రౌండర్ నితీష్‌కుమార్ ఆస్ట్రేలియా టూర్‌లో భాగంగా అనధికార నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్‌లకు ఎంపికవడంతో అందుబాటులో లేరు. ఆంధ్రా జట్టుకు షేక్ రషీద్ నాయకత్వం వహించనుండగా అభిషేక్ రెడ్డి, హనుమ విహారి ఓపెనింగ్ చేయనుండగా అశ్విన్ హెబ్బర్ మిడిలార్డర్‌లోను, శ్రీకర్ భరత్ కీపింగ్ చేస్తారు. మహీప్‌కుమార్, వంశీకృష్ణ బ్యాట్ ఝళిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో స్టీఫెన్, సత్యనారాయణ, శశికాంత్, స్పిన్ బౌలింగ్ విభాగంలో లలిత్, విజయ్ బంతి, మనీష్ మెరుపులు మెరిపించనున్నారు. రఫీ, కరణ్ షిండే సైతం జట్టుకు ఎంపికయ్యారు.

కేజీహెచ్ లేడీస్ హాస్టల్‌ను పరిశీలించిన హోంమంత్రి

మహారాణిపేట: కింగ్ జార్జ్ ఆస్పత్రిలో లేడీస్ హాస్టల్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత గురువారం రాత్రి సందర్శించారు. ఇసుక కొండ శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం పక్కన ఉన్న లేడీస్ హాస్టల్‌లో సదుపాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులతో మాట్లాడి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కేజీహెచ్ మెడికల్ కాలేజ్ విద్యార్థులు గతంలో పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగా కేజీహెచ్ మెడికల్ కళాశాల హాస్టల్ చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళల భద్రతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రౌడీ షీటర్లు లేనినగరంగా విశాఖను మారుస్తున్నామన్నారు. ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చి రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



లేడీస్ హాస్టల్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

అదనపు కట్నం కోసం కానిస్టేబుల్ వేధింపులు

బీచ్‌రోడ్డు: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఓ కానిస్టేబుల్, అతని కుటుంబ సభ్యులపై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలివీ.. కాకినాడకు చెందిన మల్లేశ్వరరావు కూమార్తె సునీతకు రామ్‌నగర్‌కు చెందిన రావణ్‌కుమార్‌తో 2018లో వివాహం జరిగింది. అతను సబ్బవరంలో పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. కాగా.. రావణ్‌కుమార్, అతని తల్లిదండ్రులు, సోదరి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని సునీత్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కట్నం తీసుకుని రాకపోతే ఎక్కడికైనా వెళ్లి చావు అంటూ నరకం చూపిస్తున్నారని అందులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు పోటీ!

- పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

కొమ్మాది: ఇప్పటివరకు ప్రైవేట్ స్థలాల కోసం ఆక్రమణలు, కొట్లాటలు చూశాం. కానీ జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ స్వర్ణభారతినగర్‌లో ప్రభుత్వ స్థలం నాదంటే నాది అంటూ ఇద్దరు వ్యక్తులు పోటీ పడిన సంఘటన చర్చనీయాంశమైంది. దాదాపు కోటిన్నర విలువ చేసే సుమారు 300 గజాల భూమిని కబ్జా చేసే ప్రయత్నాల్లో భాగంగా వీరిలో ఒకరు పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇక్కడ సుద్ద గెడ్డ వంతెన సమీపంలో 100 అడుగుల రోడ్డుకు 30 అడుగుల దూరంలో ఓ వ్యక్తికి సొంత స్థలం ఉంది. రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌కు, అతని ఇంటికి మధ్య ఉన్న ఈ 300 గజాల ఖాళీ స్థలం తనదని చెప్పుకుంటున్నాడు. అయితే ఇదే స్థలానికి పట్టాలు ఉన్నాయంటూ మరో వ్యక్తి చదును చేసి స్వాధీనం చేసుకునేందుకు గురువారం ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ క్రమంలో మొదటి వ్యక్తి పీఎంపాలెం పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై రెవెన్యూ అధికారుల వివరణ కోరగా.. రోడ్డును అనుకుని ఉన్న ఈ స్థలం ప్రభుత్వానికి చెందిందని, ఈ భూమికి ఎలాంటి పట్టాలు లేవని స్పష్టం చేశారు. ఈ స్థలం ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

27న వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు

మురళీనగర్: జిల్లా స్థాయి వెటరన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 27 నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంగ వరప్రసాద్, సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పోలీసు బ్యారెక్స్ మైదానంలో ఆ రోజు ఉదయం 6గంటల నుంచి పోటీలు నిర్వహిస్తామన్నారు. 30 ఏళ్లు పైబడిన వారందరూ తమ ఆధార్ కార్డుతో నేరుగా వచ్చి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. 5 కిలోమీటర్లు నడక, 100, 200, 400, 800, 5కిలోమీటర్ల పరుగు పందెం, ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, హేమర్‌త్రో విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. స్త్రీ, పురుషులకు వేరువేరుగా పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన విజేతలకు స్వర్ణ, కాంస్య, రజిత, పతకాలు, ప్రశంసా పత్రాలను అందిస్తామన్నారు. క్రీడాకారులకు బ్రేక్ ఫాస్ట్, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 97013 47311, 83091 57522 నంబర్లలో సంప్రదించాలన్నారు.

లిఫ్ట్ అడిగి..టూ వీలర్‌తో పరారీ

- ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన గాజువాక పోలీసులు



భానుప్రకాష్



మహేష్ నాథ్

అక్కిరెడ్డిపాలెం : లిఫ్ట్ అడుగుతారు..పొరపాటున ఇచ్చారో ఇక అంతే.. బెదిరిస్తూ వాహనాన్ని, యజమాని వద్ద ఉన్న డబ్బులతో సహా పరారవుతారు. గంజాయి, విలాసాలకు అలవాటు పడిన ఇద్దరు యువకులు తరుచూ ఇటువంటి సంఘటనలకు పాల్పడుతున్నారు. గత నెలలో జరిగిన ఇటువంటి సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుగా చేయగా..బుధవారం రాత్రి నిందితులను అరెస్టు చేసి..గురువారం గాజువాక క్రైం సీఐ కె. శ్రీనివాసరావు మీడియాకు వివరాలు వెల్లడించారు. గత నెల 29న కొత్తవానిపాలెం నుంచి కొత్త గాజువాకకు భార్గవనాయుడు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. అక్కడే ఇద్దరు యువకులు ఆ వైపు వచ్చేవారిని లిఫ్ట్ అడుగుతున్నారు. ఎవరూ వాహనాలు ఆపడం లేదు. దీంతో అక్కడే ఉన్న ఓ మహిళతో ద్విచక్రవాహనంపై వస్తున్న భార్గవ్‌ను లిఫ్ట్ అడిగించారు. వాహనం ఆపగానే..ఈ ఇద్దరు యువకులు బలవంతంగా వాహనం ఎక్కి బెదిరింపులకు పాల్పడ్డారు. వాహనం ఆపితే చంపేస్తామని బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన వాహనదారుడు ఆ ఇద్దరు యువకులు చెప్పినట్టే జింక్ గేటు వైపు పోనిచ్చాడు. జన సంచారం లేని చోట వాహనాన్ని ఆపించారు. ఆ తరువాత వాహనదారుడి మెడపై గాయపరిచి..వాహనంతో సహా పరారయ్యారు. వెంటనే బాధితుడు ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులు, స్నేహితులకు తెలియజేశాడు. దీంతో గత నెల 30న గాజువాక క్రైం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. కేసును నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలమేరకు క్రైం డీసీపీ కె.లతా మాధురి పర్యవేక్షణలో ఏడీసీపీ క్రైం మోహనరావు, ఏసీపీ జోన్-2 క్రైం ఇన్‌చార్జ్ ఎ.వెంకటరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం మధ్యాహ్నం మల్కాపురం ప్రకాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల వద్ద నివాసం ఉంటున్న నవేటి మహేష్ నాథ్ (19), శ్రీహరిపురం ఇందిరాకాలనీ జ్యోతి గ్యాస్ గొడౌన్ వద్ద నివాసముంటున్న కందిపిల్లి భానుప్రకాష్ (24)లను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.30 వేల విలువగల ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా ఇటువంటి కేసులో పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. మల్కాపురం ప్రాంతంలో ఈ ఇద్దరి యువకులపై పలు అభియోగాలు ఉన్నాయి.

యువకుడిపై హత్యాయత్నం

- తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స
- బాధితుడు పలు కేసుల్లో నిందితుడు
- బీచ్‌రోడ్డులో ఫిల్మ్ స్టూడియో వద్ద ఘటన

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు.. తిమ్మాపురం దరి రామానాయుడు ఫిల్మ్ స్టూడియో సమీపంలో ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. ప్రస్తుతం ఆ యువకుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. పాత డెయిరీ ఫారం గాంధీనగర్‌కు చెందిన 20 ఏళ్ల జామి వెంకట నవీన్ ఇంటర్ వరకు చదువుకున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం బుధవారం రాత్రి తిమ్మాపురం వైపుగా వస్తున్న క్రమంలో.. ఇక్కడ మరిడిమాంబ ఆలయం ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తులు అతని తలపై బలంగా కొట్టి పరారయ్యారు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న యువకుడిని అటుగా వెళ్లే ప్రయాణికులు గుర్తించి వెంటనే పీఎంపాలెం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో యువకుడిని కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం నవీన్ అక్కడే చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనను హత్యాయత్నం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



గాయాలతో వెంకట నవీన్

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ అప్పలరాజు

వెంకట నవీన్‌పై దాడి జరిగిన ప్రదేశాన్ని గురువారం ఉదయం ఏసీపీ ఎస్.అప్పలరాజు పరిశీలించారు. నిందితులను పట్టుకునే చర్యలు ముమ్మరం చేయాలని పోలీసులను ఆదేశించారు. ఇద్దరు లేక ముగ్గురు యువకులు ఈ ఘటనకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలువురు అనుమానితులను స్టేషన్‌కు రప్పించి విచారిస్తున్నారు. రెండు బృందాలు బీచ్ రోడ్డులో సీసీ కెమెరాలు, ప్రధాన కూడళ్లలో అనుమానిత వ్యక్తుల గురించి సమాచారం సేకరిస్తున్నాయి. యువకుడి కాల్‌డేటాను విశ్లేషిస్తున్నాయి. కాగా.. వెంకట నవీన్ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నవీన్ వ్యక్తిగత పనుల కోసం ఇటువైపు వచ్చాడా లేక వేరే ఉద్దేశంతో వచ్చాడా అనే కోణంతో దర్యాప్తు జరుగుతోంది.

జిల్లాలో నేటి నుంచి పశు గణన

ఆరిలోవ: జిల్లాలో శుక్రవారం నుంచి పశుగణన ప్రారంభిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. గణనకు సంబంధించి కేటాయించిన సిబ్బందికి గురువారం జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాదిన ప్రసాదరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గణన ఎలా చేయాలో వివరించారు. అనంతరం జేడీ మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి 28 వరకు నాలుగు నెలల పాటు పశుగణన జరుగుతుందన్నారు. ఇందుకోసం 130 మంది ఎన్యూమరేటర్లు, మరో 20 మంది పర్యవేక్షకులకు శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 6,02,190 ఇళ్లలో ఈ సర్వే చేపట్టనున్నట్లు వివరించారు.

వృద్ధుడిపై పెట్రోల్ పోసి నిప్పు

- వివాహేతర సంబంధంలో విభేదాలు

సీతమ్మధార: వివాహేతర సంబంధంలో విభేదాలు కారణంగా ఓ మహిళ వృద్ధుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధి సీతంపేటలో జరిగింది. సీతంపేటకు చెందిన సురేంద్ర గుప్తా(72), కనకానందం(54) మధ్య కొంతకాలంగా వివాహేతర సంబంధం నడుస్తోంది. ఇటీవల ఆమెకు క్యాన్సర్ సోకడంతో గుప్తా పట్టించుకోవడం మానేశాడు. దీంతో గురువారం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో అతనిపై ఆమె పెట్రోల్ పోసి నిప్పంటించింది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని గుప్తాను కేజీహెచ్‌కు తరలించారు. సీఐ డి.వి.రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

29 నుంచి సివిల్ సర్వీస్ ఉద్యోగులకు క్రీడా పోటీలు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 6 నుంచి 9 వరకు జరిగే సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలకు జిల్లా స్థాయిలో ఎంపికలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 29, 30వ తేదీల్లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చదరంగం, హాకీ, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, కబడ్డీ, కుస్తీ, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, పవర్ లిఫ్టింగ్, వెయిట్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్, వాలీబాల్‌తో పాటు యోగా, మ్యూజిక్, డ్యాన్స్ తదితర అంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ అంశాల్లో పాల్గొనే ఉద్యోగులు 28న కొమ్మాదిలోని శాప్ సమీకృత క్రీడా కాంప్లెక్స్ ఆవరణలో పేర్లు నమోదు చేసుకోవాలని డీఎస్‌డీవో జూన్ గాలియట్ కోరారు.

విజయవంతంగా పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు



మాట్లాడుతున్న ఆంధ్రా ఆస్పత్రి డైరెక్టర్ రామారావు

మహారాణిపేట: ఆంధ్రా హాస్పిటల్స్ విశాఖ ఆధ్వర్యంలో ఫీలింగ్ లిటిల్ హార్ట్స్, యు.కె.చారిటీ సౌజన్యంతో ఇప్పటి వరకు 9 మంది పిల్లలకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి డైరెక్టర్, చీఫ్ ఆఫ్ చిల్డ్రన్స్ సర్వీసెస్ డాక్టర్ పి.వి.రామారావు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు 32వ ఉచిత పిల్లల గుండె శస్త్ర చికిత్స శిబిరం నిర్వహిస్తున్నామని.. ఈ శిబిరంలో మొత్తం 15 మంది పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 9 మంది శస్త్రచికిత్సలు పూర్తయ్యాయని చెప్పారు. ఆంధ్రా హాస్పిటల్స్ ఇప్పటి వరకు నిర్వహించిన 32 క్యాంపుల్లో మొత్తం 4 వేల మందికి శస్త్రచికిత్సలు చేశామని వివరించారు. యూకేకు చెందిన పిల్లల గుండె జబ్బుల నిపుణులు సిమోన్, స్విగ్గ, వికాస్ సక్సేనా, కె.బోస్టిక్, ఫియోనా టేలర్, నినా హాల్, యాంటియా, జీజా పెట్రా దుర్కస్, స్థానిక వైద్యుల సహకారంతో విజయవంతంగా శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని వెల్లడించారు. సమావేశంలో వైద్యులు రవీంద్ర దేవ్, సుబ్రహ్మణ్యం, రేవంత్, మురళీకృష్ణ, పద్మావతి పాల్గొన్నారు.

మద్యం బెల్ట్ దుకాణంపై దాడి

- 130 క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం, నిర్వాహకుడి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పెందుర్తి: కూటమి ప్రభుత్వంలో మద్యం బెల్ట్ దుకాణాల హడావుడి మొదలైంది. నూతన మద్యం పాలసీ మొదలై పది రోజులైనా గడవక ముందే పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మద్యం బెల్ట్ దుకాణంలో భారీ ఎత్తున మద్యం పట్టుబడింది. పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు. జీవీఎంసీ 88వ వార్డు గవరజగ్గయ్యపాలెంలోని బెల్ట్ దుకాణంలో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ దుకాణంపై దాడి చేయగా, అందులో 130 క్వార్టర్ బాటిళ్ల మద్యం దొరికింది. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడు వెంకటరావును అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

4 నుంచి మేలుకొలుపు పాటల యాత్ర

సీతమ్మధార: పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే భవిష్యత్తు అంధకారమే అని పర్యావరణ కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు మజ్జి దేవిశ్రీ అన్నారు. నవంబర్ 4 నుంచి మేలుకొలుపు పాటల యాత్ర చేపడుతున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని, పర్యావరణానికి జరుగుతున్న విఘాతాన్ని, జీవకోటికి వాటిల్లుతున్న నష్టాన్ని, మనకు రానున్న ముప్పును వివరించాలని పర్యావరణ కళామండలి కోరుతుందన్నారు.